క్లుప్తంగా

చిన్నచౌక్ పోలీస్ స్టేషన్ తనిఖీ



కడప చిన్న చౌక్‌లో రికార్డులను పరిశీలిస్తున్న కడప డీఎస్పీ ఎ.వెంకటేశ్వర్లు

కడప అర్బన్: కడప నగరంలోని చిన్న చౌక్ పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం కడప డీఎస్పీ ఎ.వెంకటేశ్వర్లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి కేసుల నమోదు, దర్యాప్తులపై సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ ఎస్.తేజమూర్తి, ఎస్‌ఐలు ఎస్.రాజరాజేశ్వర రెడ్డి, పి.రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల శ్రేయస్సే లక్ష్యం

– జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.అనురాధ



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డీఈఓ

కడప ఎడ్యుకేషన్: విద్యార్థుల శ్రేయస్సే లక్ష్యంగా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పని చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి మర్రెడ్డి అనురాధ సూచించారు. కడప నగరంలోని గాండ్ల స్ట్రీట్ నగర పాలక ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అదనపు తరగతుల నిర్మాణ పనులు పరిశీలించి.. పనులు త్వరగా పూర్తిచేస్తే మౌలిక వసతులు సమకూరుతాయని, విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా ఉంటుందని తెలిపారు. కిచెన్ గార్డెన్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ప్రతి పాఠశాలలో లీగల్ సర్వీస్ అథారిటీ టోల్ ఫ్రీ నెంబర్ అందరికీ కనిపించేలా ప్రదర్శించాలని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులతో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యాస్మిన్ బేగం, సీఆర్‌పీ.కృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

కడప కార్పొరేషన్: కడప నగరం రూరల్ పరిధిలోని ఉక్కాయపల్లె, ఐడీఎస్ఎస్, నానాపల్లె, పాత కడప సబ్ స్టేషన్ల పరిధిలోని ప్రాంతాల్లో శనివారం విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈస్ట్ రూరల్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శివప్రసాద్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.10 గంటల వరకూ విద్యుత్తు సరఫరా ఉండదని, ప్రజలు ఈ మార్పును గమనించాలని కోరారు.

21న కాశీలో సామూహిక పిండ ప్రదానం



కడప రైల్వే స్టేషన్‌లో భక్తులు

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప కాశీ విశ్వనాథ సేవా సమితి ఆధ్వర్యంలో వారణాసిలో సామూహిక పిండ ప్రదానం చేసేందుకు ఓ బృందం శుక్రవారం సాయంత్రం కాశీ యాత్రకు బయలుదేరింది. అనాథలుగా మృతిచెందిన 375 మందికి ఈ నెల 21న సోమవారం సామూహిక పిండ ప్రదానం కాశీ నిర్వహించనున్నారు. కార్యక్రమంలో గుండ్లకొండ రవి, రెడ్డి లక్ష్మణ్, పుట్టా పురుషోత్తం, సురేష్‌బాబు, దామోదర్, రవి, దినేష్, రాజశేఖరరెడ్డి, మధు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఖాదరయ్య మృతికి వైవీయూ సంతాపం



సంతాపం తెలుపుతున్న అధికారులు

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం కళాశాల హాస్టల్ ఉద్యోగి ఖాదరయ్య గుండెపోటుతో మృతిచెందారు. వైవీయూ పరిపాలన భవనం ప్రాంగణంలో శుక్రవారం సంతాప సభ నిర్వహించారు. వైవీయూ వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి, ప్రిన్సిపల్ ఎస్.రఘునాథరెడ్డి, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ పి.పద్మ ఖాదరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సన్‌రైజ్ ఆస్పత్రికి వైద్య నిపుణుల రాక

కడప ఎడ్యుకేషన్: కడప నగరం కోటిరెడ్డి ఉమెన్స్ కళాశాల పక్కన ఉన్న సన్‌రైజ్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రికి ఈ నెల 19వ తేదీన హైదరాబాద్‌కు చెందిన సీనియర్ సర్జికల్ అంకాలజిస్టు డాక్టర్ వీఎం.శంకర్‌రెడ్డి వస్తున్నట్లు సన్‌రైజ్ ఆస్పత్రి ప్రతినిధులు తెలిపారు.ఆయన రొమ్ము, గర్భాశయం, గొంతు మరియు థైరాయిడ్, నోరు, తల, మెడ, చిన్నపేగు, పెద్ద ప్రేగు క్యాన్సర్ వ్యాధులకు చికిత్స చేస్తారని తెలిపారు. ప్రతి శని, ఆదివారాల్లో ఆసుపత్రిలో ఆయన అందుబాటులో ఉంటారని, అపాయింట్‌మెంట్ కోసం 8886655565కు కాల్ చేయవచ్చని చెప్పారు.

రైతు బజారు ఇలా.. కొనేదెలా?

- కుళ్లిన కూరగాయలు, వ్యర్థాలతో ఆవరణంలో దుర్గంధం
- స్వీపర్లు లేక పారిశుద్ధ్యం అస్తవ్యస్తం
- ఇబ్బంది పడుతున్న వినియోగదారులు

కడప అగ్రికల్చర్: అపరిశుభ్రత మధ్య రైతు బజార్ అధ్వానంగా కనిపిస్తోంది. చిన్న పాటి వర్షం కురిసినా అక్కడక్కడా గోతుల్లో నీరు నిలుస్తోంది. కుళ్లిన కూరగాయలు అక్కడే పడేయడంతో దుర్గంధం వెదజల్లుతోంది. కూరగాయలు కొనేందుకు కడప నగరంలోని రైతు బజారుకు వెళ్లాలంటే వినియోగదారులు బేజారు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు దారుల్లో బురద కనిపిస్తోంది. అక్కడక్కడా ఎగుడు దిగుళ్లు ఉండడంతో చిన్నపాటి వర్షం వచ్చినా పారిశుద్ధ్యం లోపించి గోతుల్లో నీరునిలుస్తోంది. స్వీపర్ పోస్టులు నెలల తరబడి భర్తీ చేయకపోవడంతో శుభ్రం చేయడంలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. కుళ్లిన కూరగాయలు, వ్యర్థాలు ఎక్కడంటే అక్కడ పడేయటంతో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారై దుర్వాసన వస్తోంది.



కడప నగరంలోని రైతు బజార్



ఆవరణంలో చెత్త కుప్పలు



అపరిశుభ్రతలోనే కూరగాయలు శుభ్రం చేస్తూ

ఎవరి దుకాణం వద్ద వారే..

కడప రైతు బజారులో 128 కూరగాయలు, ఆకు కూరలు, ఎర్రగడ్డల షాపులు ఉన్నాయి. ఇంత పెద్ద రైతు బజార్‌లో స్వీపర్లు లేకపోవడంతో ఎవరి దుకాణం వద్ద వాళ్లే శుభ్రం చేసుకుంటున్నట్లు స్థానికులు తెలిపారు. శుభ్రం చేసుకున్న చెత్తా చెదారాన్ని ఎత్తివేసి రైతుబజార్ వద్ద కుప్పగా వేస్తున్నారు. అది కాస్త కుళ్లడంతో కూరగాయల కోసం రైతుబజారుకు వచ్చే వినియోగదారులు దుర్వాసన భరించలేకపోతున్నారు. మార్కెటింగ్ శాఖ అధికారులు స్పందించి స్వీపర్లను ఏర్పాటుచేయాలని కోరుతున్నారు. ఈ విషయంపై రైతు ఎస్టేట్ ఆఫీసర్‌ను వివరణ కోరగా త్వరలో ఇద్దరు స్వీపర్లు వస్తారని తెలిపారు.

దుర్గంధం వెదజల్లుతోంది



వర్షం పడినప్పుడు రైతు బజారుకు కూరగాయలకు వెళ్లాలంటే భయమేస్తోంది. కూరగాయలు, ఆకు కూరలను ఎక్కడంటే అక్కడ పడేస్తారు. వర్షం వచ్చినప్పుడు అవి కుళ్లి దుర్గంధం వెదజల్లుతోంది. వ్యర్థాలను శుభ్రం చేసేందుకు సిబ్బందిని నియమించాలి. లేక పోతే మార్కెట్ అధ్వానంగా మారుతుంది.

– శివకృష్ణారెడ్డి, వై-జంక్షన్, కడప

అక్కడికి పోగానే.. కంపు



కూరగాయల కోసం రైతు బజారు వద్దకు వెళ్లగానే భరించరాని దుర్గంధం వెదజల్లుతోంది. కూరగాయలతోపాటు చెత్తాచెదారం అంతా తెచ్చి రైతు బజార్ ఎదురుగా కుప్పగా వేస్తారు. వాటిని తినేందుకు ఆవులు వచ్చి తొక్కితొక్కి పెడతాయి. దీంతో కంపు కొడుతోంది.

– శ్రీనివాసులు, ,ఎంజే.కుంట, కడప

చెత్త తొలగించడం లేదు...



రైతు బజారు ఎదురుగా చెత్తకుప్ప వేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఎప్పుడన్నా ఒకసారి వచ్చే మాకు చాలా ఇబ్బందిగా ఉంటుంది. నిత్యం ఆ చెత్త కుప్ప పక్కనే పండ్లు అమ్ముకొనే వారి పరిస్థితి మరింత అధ్వానంగా ఉంటుంది. ఈ విషయంలో అధికారులు స్పందించాలి.

– చిన్నా, చిన్నచౌక్, కడప

అమరవీరుల కుటుంబాలను ఆదుకుంటాం

– జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు

కడప కోటిరెడ్డిసర్కిల్: విధి నిర్వహణలో వివిధ కారణాలతో మృతి చెందిన అమర వీరుల కుటుంబీకుల సంక్షేమానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని కడప జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు అన్నారు. స్థానిక పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో మృతి చెందిన పోలీసుల కుటుంబ సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా అందాల్సిన సౌకర్యాలు(బెనిఫిట్స్), అర్హులైన కుటుంబ సభ్యుల కారుణ్య నియామకాలు, కుటుంబ స్థితిగతులు, బాగోగులను అడిగి తెలుసుకున్నారు. అందరికీ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో మృతి చెందిన పోలీసు కుటుంబాల సమస్యలను తెలుసుకోవడానికి ఈ సమావేశం ఏర్పాటుచేశామన్నారు. మరణించిన సిబ్బంది కుటుంబాలతో సమన్వయం చేసుకుని వారి సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని జిల్లా పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్‌లకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీఓఏఓ జ్యోతి, సూపరింటెండెంట్ తులసీరామ్, శ్రీనివాస్‌నాయక్, సురేష్, ఆర్ఐ టైటాస్, తదితరులు పాల్గొన్నారు.



విధి నిర్వహణలో మరణించిన వారి కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న ఎస్పీ

నగరంలో నీటి నిల్వలు తొలగించాలి

- నగర పాలక కమిషనర్ మనోజ్ రెడ్డి



ఆర్టీసీ బస్టాండులో నిల్వ ఉన్న నీటిని పరిశీలిస్తున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప కార్పొరేషన్: కడప నగరంలోని ఆర్టీసీ బస్టాండుతోపాటు వివిధ ప్రాంతాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించేందుకు చర్యలు చేపట్టాలని నగర పాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి ఆదేశించారు. మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆర్టీసీ బస్టాండ్, గురుకుల విద్యాపీఠం, బ్రహ్మయ్య షెడ్, అప్సర సర్కిల్, టీటీడీ కళ్యాణ మండపం, ప్రకాశ్‌నగర్ ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఆర్టీసీ బస్టాండు వద్ద నిల్వ ఉన్న నీటిని తొలగించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నీటి నిల్వ సమస్యల పరిష్కారానికి ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. గురుకుల విద్యాపీఠం నుంచి బ్రహ్మయ్య షెడ్ వరకు నిల్వ ఉన్న నీటిని తొలగించేందుకు పారిశుధ్య విభాగం సిబ్బందితో కలిసి పనిచేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అప్సర సర్కిల్ నుంచి టీటీడీ కళ్యాణ మండపం వరకూ చెత్త పాయింట్లు తొలగించి పరిసరాలు శుభ్రపరచాలన్నారు. పర్యావరణ శుభ్రత విషయంలో నిర్లక్ష్యం వహించకుండా పనిచేయాలన్నారు. ప్రకాశ్‌నగర్ వద్ద విశ్వేశ్వరయ్య సర్కిల్ సమీపంలో జరుగుతున్న పనులను నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ధనలక్ష్మి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కిరణ్ కుమార్, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, నగరపాలక సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలకు నాణ్యమైన భోజనాన్ని వడ్డించండి

- మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫ్రక్రుద్దీన్



గాంధీ నగర్ హైస్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్జి బాబా ఫ్రక్రుద్దీన్

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని పిల్లలకు వడ్డించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫ్రక్రుద్దీన్ సూచించారు. కడపలోని కాగితాలపెంటలోని తెలుగు ప్రాథమిక, జిల్లా పరిషత్, ఎర్రముక్కపల్లి గాంధీ నగర్ ప్రాథమిక, ఉన్నత, చెమ్మియాపేట బాలికోన్నత పాఠశాలలను ఆయన సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. మెనూ ప్రకారం అందిస్తున్నారా అని విద్యార్థులతో ఆరా తీశారు. వటశాల, డైనింగ్ హాల్, స్టోర్ రూమ్‌లను పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. అనంతరం లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ గంగిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరద ప్రభావిత కుటుంబాలను ఆదుకోవాలి



తహసీల్దారు నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప మండల పరిధిలోని అల్లూరి సీతారామరాజునగర్ , చెంచు కాలనీల్లో పేద కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఐ నగర కార్యదర్శి యస్.వెంకటశివ కోరారు. మండల తహసీల్దారు నారాయణరెడ్డిని శుక్రవారం కలిసి ఆయన సమస్యలను విన్నవించారు. అనంతరం మాట్లాడుతూ గురువారం అర్ధరాత్రి వరద నీరు లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లల్లోకి ప్రవేశించడంతో పేదలు తీవ్రంగా నష్టపోయారన్నారు. 48 వ డివిజన్ పరిధిలోని ఏఎస్ఆర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రాథమిక పాఠశాల వద్ద అర్ధరాత్రి రెండు గంటల సమయంలో ఇళ్ళను చుట్టుముట్టిందన్నారు. ఆ ప్రాంతంలో వరదనీరు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి కేసీ.బాదుల్లా, మునెయ్య, లింగన్న, తిరుపాలు, వీరయ్య, బాధితులు పాల్గొన్నారు.

సమాచార చట్టంపై అవగాహన కల్పిస్తున్నాం



మాట్లాడుతున్న ఏఓ సరస్వతి

కమలాపురం : ప్రతి పౌరుడు సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ఏడీఏ కార్యాలయంలో వీఏఏ, ఎరువుల, పురుగు మందుల దుకాణాల డీలర్లు, రైతులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల నుంచి ప్రతి ఒక్కరు తమకు కావలసిన సమాచారాన్ని స.హ.చట్టం ద్వారా పొందవచ్చన్నారు. ఈ ప్రక్రియ మూడు దశల్లో ఉంటుందన్నారు. మొదటి దశలో సమాచారం కావలసిన వారు ముందుగా సెక్షన్ 6(1) చట్టం ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆ దరఖాస్తులో తమకు కావాలసిన అంశాలను పొందు పరచాలన్నారు. 30 రోజుల్లోపు దరఖాస్తుదారుడికి సమాచారం అందకుంటే, లేదా వారిచ్చిన సమాచారంతో తృప్తి చెందకుంటే రెండవ దశలో సెక్షన్ 19(1) ద్వారా ఉన్నతాధికారులకు 30 రోజుల్లో అప్పీలు చేసుకోవచ్చన్నారు. రెండవ దశలో వచ్చిన సమాచారంతో తృప్తి చెందనప్పుడు 90 రోజుల్లోపల సమాచార కమిషనర్‌కు అప్పీలు చేసుకోవచ్చని సూచించారు. ఏఓ సరస్వతి, వ్యవసాయ సిబ్బంది, డీలర్లు, రైతులు పాల్గొన్నారు.







జలపాతం అందాలు అదరహో

ప్రకృతి అందాలకు నెలవైన పాలకొండల్లో జలపాతాల అందాలు చూపరులను కట్టిపడేస్తున్నాయి. జల జలపాతాల హొయలు.. పక్షుల కిలకిల రావాలు.. పచ్చతనం అందాలు ప్రకృతి ప్రేమికులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. గత ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కడప నగర శివారులోని పాలకొండల పై నుంచి నీరు జాలువారుతోంది. కడప నగరం నుంచి ఈ దృశ్యం తిలకించేందుకు తండోపతండాలుగా తరలివస్తున్నారు. స్నానాలు చేస్తూ కేరింతలు కొడుతున్నారు. చరవాణుల్లో సెల్ఫీలు దిగుతూ ఆనంగా గడిపేస్తున్న దృశ్యాలను సాక్షి కెమెరా బంధించింది.

– రఫీ, సాక్షి ఫొటోగ్రాఫర్

కమలాపురంలో భారీ వర్షం

కమలాపురం : మండలంలో గురువారం రాత్రి దాదాపు గంటకు పైగా భారీ గాలులు, మెరుపులు, ఉరుములతో కుండపోత వర్షం కురిసింది. 62.4 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. కాగా ఈ వర్షానికి తోతట్టు ప్రాంతాలైన ఎన్టీఆర్ కాలనీ, పోలీస్ లైన్ వీధి, బ్రాహ్మణవీధి, రామ్‌నగర్, కృష్ణానగర్, మారుతినగర్ తదితర కాలనీలన్నీ నీట మునిగాయి. అలాగే పలు ప్రాంతాల్లో రోడ్లు సైతం కనబడకుండా నీట మునిగాయి. కాలనీలకు వెళ్లడానికి, అందులోని ఇళ్లలోకి రాక పోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చాలా చోట్ల వర్షం నీరు ఎక్కడికి ప్రవహించకుండా అలాగే అక్కడికక్కడే ఆగి పోయింది. ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి వర్షం నీళ్ల నిలవకుండా తగిన చర్యలు తీసుకోవాలని నివాసితులు కోరుతున్నారు. కాగా టి.చదిపిరాళ్ల, సి.గోపులాపురం, పాచికలపాడు, సంబటూరు తదితర గ్రామాల్లోని పొలాల్లో వర్షం నీరు నిలవడంతో అవి నదులను తలపిస్తున్నాయి. అలాగే కమలాపురం, చాపాడు మండలాలకు వారధిగా ఉన్న పెన్నా నదిపై ఉన్న కాజ్ వే చాలా వరకు తెగిపోయింది. ఈ రెండు మండలాలకు రాకపోకలు స్థంభించాయి.

పిడుగు పాటుకు ధ్వంసమైన వేప చెట్టు

పెండ్లిమర్రి : మండలంలోని మర్రిమాకులపల్లెలో గురువారం రాత్రి పెద్ద వేపచెట్టుపై ఒక్కసారిగా పిడుగు పడటంతో చెట్టుపై భాగంలో ఉన్న కొమ్మలు విరిగాయి. చెట్టు పైనుంచి కింది వరకు చీలిపోయింది. చుట్టు పక్కల ఎవరు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. గత పదిహేను రోజుల నుంచి పెండ్లిమర్రి మండలంలో ఇప్పటికి మూడు సార్లు పిడుగులు పడటంతో పిడుగు పాటుకు గురై ముగ్గురు వ్యక్తులు, ఒక పశువు చనిపోయింది. ప్రజలు బయటకు వెళ్లాలంటే భయపడుతున్నారు.

ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి



ఫ్రెషర్స్‌డే వేడుకల్లో ఏఎఫ్‌యూ వీసీ ఆచార్య జి. విశ్వనాథకుమార్

- ఏఎఫ్‌యూ వైస్ ఛాన్సలర్ ఆచార్య జి.విశ్వనాథ కుమార్

ఏఎఫ్‌యూ: విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య జి.విశ్వనాథకుమార్ అన్నారు. విశ్వవిద్యాలయంలో పునర్నవ పేరుతో ఫ్రెషర్స్ డే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఫైన్ ఆర్ట్స్ కోర్సులో నాలుగేళ్ల, ఆర్కిటెక్చర్‌లో ఐదేళ్ల విద్య అమూల్యమైనదని, ఉపాధికి అవసరమైన నైపుణ్యాలను పరిజ్ఞానాన్ని పెంపొందించుకొని అత్యున్నత స్థాయికి చేరుకోవాలన్నారు. పోటీ ప్రపంచంలో నైపుణ్యం కలిగిన ఫైన్‌ఆర్ట్స్, ఆర్కిటెక్చర్ విద్యార్థులకు మంచి ఉద్యోగాలు లభిస్తున్నాయన్నారు. రిజిస్ట్రార్ ఎస్.రాజేష్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ తమ జీవితానికి ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకొని, ఎన్ని అడ్డంకులు ఎదురైనా వాటిని అధిగమిస్తూ ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు పోటీతత్వాన్ని అలవరచుకోవాలి



బహుమతులు అందిస్తున్న వైద్యులు, హెచ్‌ఎం

కమలాపురం : ప్రస్తుతం ఉన్న పోటీ ప్రపంచంలో రాణించాలంటే విద్యార్థులందరూ ప్రాథమిక స్థాయి నుంచే పోటీతత్వాన్ని అలవరచుకోవాలని చిన్న చెప్పలి జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం వెంకటసుబ్బయ్య తెలిపారు. శుక్రవారం చిన్నచెప్పలి హైస్కూల్ విద్యార్థులకు సెప్టెంబర్ మాసంలో జరిగిన ప్రాజెక్ట్ వర్క్‌లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఏకలవ్య ఫౌండేషన్ వారు వితరణ చేసిన బహుమతులు అందజేశారు. వాటిని కంటి వైద్యులు అరుణ, మనీష్‌కుమార్ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రస్తుతం పోటీ ప్రపంచంలో రాణించాలంటే ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులందరూ పోటీ తత్వాన్ని అలవరచుకోవాలన్నారు. ఏకలవ్య ఫౌండేషన్ విద్యార్థులను ప్రోత్సహించేందుకు తన వంతుగా సాయం చేయడం అభినందనీయం అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలను అధిరోహించాలన్నారు. ప్రతి ఒక్కరూ ప్రణాళికా బద్ధంగా చదివి మంచి మార్కులతో టెస్ట్ క్లాస్‌లో మండల, జిల్లా టాపర్లుగా నిలవాలని ఆయన సూచించారు. వీరనారాయణ పాల్గొన్నారు.

స్మార్ట్ సిటీ.. ఇదేనా బాబు

స్మార్ట్ సిటీ పేరుతో ప్రసంగాలు చేస్తున్న నాయకులను కడప నగరం వెక్కిరిస్తోంది. గత ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎక్కడబడితే అక్కడ వర్షపు నీరు నిలుస్తోంది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కడప నగరంలోని ప్రకాష్ నగర్ ఇండస్ట్రియల్ ఎస్టేట్, దేవునిగడప మార్కెట్ యార్డుల వద్ద వర్షపునీటితో మురికి నీరు చేరి దారి ఇలా అధ్వానంగా మారింది. ఈ దృశ్యాలకు సాక్షి కెమెరా స్పందించింది.





రఫీ, సాక్షి ఫొటోగ్రాఫర్

నల్లని మబ్బుల నీడన.. వెన్నెల

సాయం సంధ్యా సమయంలో నల్లని మబ్బులు కమ్ముకున్నాయి.. దీనికి తోడు అప్పుడప్పుడే అస్తమిస్తున్న భానుడి వెలుతురులో.. రాత్రి చంద్రుని వెన్నెలను తలపిస్తోంది. భక్తుల తొలి గడప కడపలో సాక్షి కెమెరా తీసిన సుందర దృశ్యాలివీ.